### ఇద్దరు పిల్లలను చెరువులోకి తోసి

# ఆపై తల్లి ఆత్మహత్య

- త్రుటిలో తప్పించుకొన్న మరో కొడుకు
- ఇబ్రహీంపట్నంలో ఘటన

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5: జీవితంపై విరక్తితో ఓ మహిళ తన ఇద్దరు పిల్లలను నీటిలోకి తోసి ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నది. ఈ క్రమంలో మరో బాబు త్రుటిలో తప్పించుకొన్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. వివరాలు ఇలా.. రంగారెడ్డి జిల్లా మునగనూర్‌కు చెందిన ఒడుసు కుమార్ మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు. కొన్ని కారణాలతో ఆమె తన ఇద్దరు పిల్లలను కుమార్ వద్ద వదిలేసి విడాకులు తీసుకున్నది. ఆ తరువాత అతడు మంగను రెండో పెండ్లి చేసుకోగా వీరికి ఇద్దరు పిల్లలు పుట్టారు. మొత్తం నలుగురు పిల్లలతో కలిసి వీరు వనస్థలిపురంలో నివాసం ఉంటున్నారు. ఇతను వడ్డరి పనిచేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో విసిగిపోయిన మంగ గురువారం సాయంత్రం పిల్లలు లావణ్య(14), శరత్(12)తోపాటు ఆరేండ్ల చరణ్‌ను స్కూల్ నుంచి తీసుకొని నేరుగా ఇబ్రహీంపట్నం చెరువు వద్దకు చేరుకున్నది. రాత్రి 7 గంటల సమయంలో చెరువులో స్నానం చేద్దామని చెప్పి మొదట ఇద్దరు పిల్లలను చెరువులోకి తోసేసింది. ఆరేండ్ల బాలుడు చరణ్‌ను కూడా నీటిలోకి నెట్టడానికి ప్రయత్నించగా తప్పించుకుని పారి పోయాడు. మంగ కూడా చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చరణ్ రోడ్డుపైకి వచ్చి అటుగా వెళ్లేవారికి చెప్పాడు. ఓ ఆటో డ్రైవర్ వారిని కాపాడటానికి చెరువు వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మంగ, తన ఇద్దరు పిల్లలు మృతి చెందారు. మంగ, శరత్ మృతదేహాలను బయటికి తీయగా లావణ్య మృతదేహం లభించలేదు. లావణ్య మొదటి భార్య బిడ్డకాగా, శరత్ సొంత కొడుకు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# చేనేత కార్మికులను ఆదుకోండి

- ‘నేతన్న చేయూత’ ఆర్‌డీ-1లో జమకు అవకాశం ఇవ్వండి
- హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ కమిషనర్‌కు చేనేత కార్మిక సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం ప్రభుత్వాన్ని కోరింది. పది నెలలుగా గిరాకి లేకపోవడంతో ‘చేనేత చేయూత’ పథకం కింద ఆర్‌డీ-1 అకౌంట్‌లో నెల వారీగా డబ్బులు జమ చేయలేక పోయామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మంది చేనేత కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆర్‌డీ-1 అకౌంట్‌లో జమ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇస్తే ఆర్‌డీ-2 అకౌంట్ నుంచి డబుల్ అమౌంట్ జోడించి, తిరిగి కార్మికులకు చెల్లించడానికి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు స్వామి హ్యాడ్‌లూమ్, టెక్స్‌టైల్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్టు చెప్పారు.

# ఆటోలోనే ప్రసవం

### భద్రాచలం దవాఖానకు వెళ్తే అందుబాటులేని వైద్యులు

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 5: పురిటి నొప్పులు పడుతున్న ఓ నిండు గర్భిణిని ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా ఆటోలోనే ప్రసవించింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. భద్రాచలంలోని చప్టా దిగువ ప్రాంతానికి చెందిన సంధ్య నిండు గర్భిణి. పురిటి నొప్పులు ఎక్కువగా రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆటోలో భద్రాచలం ఏరియా దవాఖానకు తీసుకెళ్లారు. ఆ సమయంలో వైద్యులెవరూ అందుబాటులో లేరు. గర్భిణిని కొత్తగూడెం ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాలని అక్కడి సిబ్బంది ఆమె కుటుంబ సభ్యులకు సూచించారు. కొత్తగూడెం తీసుకెళ్తుండగా పురిటి నొప్పులు ఎక్కువై సంధ్య ఆటోలోనే ప్రసవించింది. ఆమెకు ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం ఏరియా దవాఖానలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా.. గత నెల 23న నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలానికి చెందిన నల్లవెల్లి అశ్విని పురిటి నొప్పులతో కాన్పు కోసం జిల్లా జనరల్ దవాఖానకు వచ్చి కుర్చీలోనే డెలివరీ అయింది. ఈ ఘటనను మరువకముందే.. ఇదే దవాఖానలో వైద్యులు, సిబ్బంది నిర్వాకంతో.. మాడ్గులపల్లి మండలం గారకుంట పాలెంకు చెందిన చెరుకుపల్లి శ్రీలత గర్భంలో శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందాడని బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది.

# డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మత్తు అలవాటు కలిగించే మందుల వాడకాన్ని (హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్) నియంత్రించేందుకు ఫార్మసిస్టులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. మత్తురహిత సమాజ నిర్మూలనలో భాగంగా హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ దుర్వినియోగం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, డీసీఏ చేపడుతున్న చర్యలకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ శ్రీనివాస్, కే శ్రీనివాస్ పేర్కొన్నారు. క్వాలిఫైడ్ డాక్టర్ నుంచి ప్రిస్క్రిప్షన్ తీసుకొచ్చిన తర్వాతే మందులు కొనుగోలు చేయాలని రోగులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.














